## క్లుప్తంగా

### వెంకన్నకు వెండి నగల వితరణ



వెండి నగలు అందజేస్తున్న దాతలు

గార: మండల కేంద్రంలోని వంశధార నదీతీరంలో వేంకటేశ్వరుని ఆలయానికి నాలుగు కేజీల వెండి నగలను భక్తులు వితరణగా అందజేశారు. కార్తీక ఏకాదశి పురస్కరించుకొని విశాఖపట్నానికి చెందిన టెంకల శ్యామ్‌కుమార్, శ్రీకాకుళానికి చెందిన కింతలి తులసీదాస్, కళింగపట్నానికి చెందిన శాంతిశ్వీరరావు మాష్టారులు నాలుగు కేజీల వెండితో చేసిన కిరీటం, దివ్య హస్తాలు, పాదుకలను గురువారం అందజేశారు. పురోహితులు జాడ వెంకట సునీల్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త కింతలి కృష్ణారావు, బోర్డు మెంబర్లు, భక్తులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



చెక్ అందజేస్తున్న దాతలు

గార: శ్రీకూర్మనాథాలయంలో నిత్యం జరిగే అన్నదానానికి నరసన్నపేట మండలం కోమర్తి గ్రామానికి చెందిన కొల్లి వరప్రసాద్, రమణమ్మ దంపతులు గురువారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు ఈవో జి.గురునాథంకు చెక్ అందించారు. కార్యక్రమంలో స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, నర్సుబాబు పాల్గొన్నారు.

### ఆదిత్యుని సన్నిధిలో రిటైర్డ్ జీఎం



జనార్దనరావుకు జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు, శంకరశర్మ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఈపీడీసీఎల్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ సనపల జనార్దనరావు కుటుంబసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్షుడు ఉంగటి పాపారావు, కునుకు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: రక్తదానం చేస్తే ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు అన్నారు. ఐటీఐలో గురువారం శ్రీకాకుళం జనరల్ హాస్పటల్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 31 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. బ్లడ్ బ్యాంక్ వైద్యురాలు వి.సునీత ఆధ్వర్యంలోని సిబ్బంది రక్తం సేకరించారు. ఐటీఐ టీఓలు బి.కామేశ్వరరావు, పి.విద్యాసాగర్, వైద్య సిబ్బంది ఎస్.తాతారావు, డి.లావణ్య, కె.రమేష్ పాల్గొన్నారు.

### 93 మందికి కంటి పరీక్షలు



కంటి శస్త్ర చికిత్సలకు శ్రీకాకుళం తరలిస్తున్న దృశ్యం

రణస్థలం: మండల కేంద్రంలోని కల్యాణి ఆస్పత్రిలో 93 మంది వృద్ధులకు గురువారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆస్పత్రి పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కల్యాణి తెలిపారు. 22 మందిని శస్త్రచికిత్సల కోసం శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించామన్నారు. వారందరికీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు చేసి మందులు అందజేస్తారన్నారు.

### నేడు తెప్పోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా సమీపంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర దేవస్థానంలో క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీవారు, అమ్మవార్ల తెప్పోత్సవం పవిత్ర నాగావళీ నదిలో నిర్వహిస్తామని ఆలయ గౌరవాధ్యక్షుడు లోకనాథం నందికేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# సర్వం సాయిమయం

- వైభవంగా సత్యసాయి జయంతి వేడుకలు
- కేక్ కట్ చేసిన కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు



పెద్దమందిరంలో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



సత్యం,శివం, సుందరం మందిరం ఆధ్వర్యంలో ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ప్రతి సాయి మందిరం వద్ద అన్నదానాలు, సేవా కార్యక్రమాలు చేపట్టారు. అంతకుముందు కేక్ కటింగ్, తిరువీధి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాలకొండ రోడ్డులోని పెద్దమందిరంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ సేవ చేయాలనే లక్ష్యం ఎంతో గొప్పదని పేర్కొన్నారు అనంతరం కన్వీనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వరం చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీలు అంధవరపు ప్రసాద్, సంతోష్, జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, జి.రమణబాబు, సత్యసాయి సేవకులు, పాల్గొన్నారు. న్యూకాలనీ సత్యసాయి మందిరంలో కన్వీనర్ జయరాం గుప్తా ఆధ్వర్యంలో 21కేజీల కేక్ కట్ చేశారు. సత్యసాయి వ్రతాలు, రుద్రాభిషేకం ప్రారంభించారు. కార్యక్రమంలో డి.వి.ఎస్ భరద్వాజ్ పాల్గొన్నారు. మిగిలిన మందిరాల్లోనూ ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



గార: బోరవానిపేటలో సత్యసాయి పూజల్లో పాల్గొన్న భక్తులు



న్యూకాలనీలోని సత్యసాయి మందిరంలో స్వామికి కేక్ సమర్పణ

గార:మండలంలోని బోరవానిపేట, గోరువానిపేట గ్రామాల్లో సత్యసాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం నామ సంకీర్తన, పల్లకీ ఉత్సవ సేవ, 98 జ్యోతులతో జ్యోతిప్రజ్వలన, బాలవికాస్ పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సతివాడ సత్యసాయి మందిరంలో ఆమదాలవలసకు చెందిన నాట్యశ్రీ నృత్యకళానికేతన్ ఆధ్వర్యంలో చిన్నారుల నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు.



చెక్క భజన చేస్తున్న భక్తులు



రిమ్స్‌లో సాయిబాబా జయంతి వేడుకలు



అరసవల్లి శాంతి క్షేత్రంలో భజనలు

## పక్కాగా ఓటర్ల జాబితా

ఎచ్చెర్ల క్యాంపస్: ఓటర్ల జాబితాలు పారదర్శకంగా తీర్చిదిద్దుతున్నట్లు ఎచ్చెర్ల నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వై.పద్మావతి అన్నారు. ఎచ్చెర్ల మండలం అల్లినగరం, బొంతల కోడూరు గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమీక్ష నిర్వహించారు. రాజకీయ పార్టీల అభ్యంతరాలు, ఫిర్యాదులు పరిశీలించనున్నట్లు చెప్పారు.

18 ఏళ్లు దాటిన వారికి ఓటు హక్కు, మృతి చెందిన వారి ఓట్ల తొలగింపు, ఒకటికి మించి ఓట్లు ఉంటే తొలగింపు వంటిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నామన్నారు. రాజకీయ పార్టీల ఫిర్యాదులపై సైతం సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలు పక్కాగా రూపొందిస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయి సిబ్బంది సైతం దర్యాప్తు నిర్వహించి అర్హులకు ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలన్నారు. రాజకీయ పార్టీల సూచనలు, సలహాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తహసీల్దార్ టి.సత్యనారాయణ పాల్గొన్నారు.



అల్లినగరం సచివాలయంలో మాట్లాడుతున్న ఎస్‌డీసీ పద్మావతి

## బేస్‌బాల్‌లో విద్యార్థికి రజతం



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి బి.దీక్షిత ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ద్వితీయ స్థానంలో రజత పతకం సాధించిందని ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

# డీవైఈవోకు అభినందనలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారిగా నియమితులైన రాకోటి విజయకుమారి(డీవైఈవో)ని ఆంధ్రప్రదేశ్ గుర్తింపు కలిగిన ప్రైవేటు పాఠశాలల సంఘం(ఆపుస్మా) రాష్ట్ర, జిల్లాశాఖల ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలు వివరించారు.

కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.లక్ష్మణరావు, కార్యవర్గ సభ్యులు ఎ.అనంతరావు, జిల్లా కోశాధికారి జ్యోతిప్రసాద్, పలు పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.



విజయకుమారికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆపుస్మా ప్రతినిధులు

## ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం



మంచినీటి పనులను ప్రారంభిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: ప్రతి ఇంటికి మంచినీటిని అందిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌హనోహర్‌నాయుడు అన్నారు. పెదపాడు పరిధిలోని గాంధీనగర్, జాడపేట గ్రామస్తుల సౌకర్యార్థం రూ.40లక్షల 70వేలతో మంచినీటి కుళాయిలు, వాటర్ ట్యాంక్ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు సారథ్యంలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



జి.సిగడాం: సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

రణస్థలం: ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండలంలోని పాతర్లపల్లి గ్రామ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ జెండాను గురువారం ఆవిష్కరించారు. గ్రామ సచివాలయానికి లబ్ధిచేకూరిన సంక్షేమ, అభివృద్ధి పథకాల జాబితాను ప్రదర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జ్ చిల్ల వెంకటరెడ్డి, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

**పూడివలసలో..**

ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలస గ్రామ సచివాలయం పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఆవిష్కరించారు. అనంతరం పల్లెనిద్ర, సహపంక్తి భోజనలు చేశారు. ఇంటింటికీ వెళ్లి 24 పేజీల బుక్‌లెట్లు అందజేసి ప్రభుత్వ ప్రగతిని వివరించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను ఎన్నుకోవాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, సర్పంచ్ జరుగుళ్ల కృష్ణారావు, ఈఓపీఆర్డీ కణితి ఈశ్వరమ్మ, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**ఎందువలో..**

జి.సిగడాం: మండలంలోని ఎందువ గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల మహిళాసమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని వివరించారు. జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ ఎర్నేన ప్రకాశరావు, సర్పంచ్ అల్లు జోగినాయుడు, నాయకులు జి.రాములు, వాన వెంకటరమణ, కింజరాపు మల్లేశ్వరావు, నక్క కోటేశ్వరావు, కింజరాపు జగన్‌మోహన్, ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: పాతర్లపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సాయికుమార్



ఎచ్చెర్ల క్యాంపస్: సంక్షేమ పథకాలు ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చిరంజీవి

## మాస్టర్ ప్లాన్‌పై సమావేశం నేడు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం కార్పొరేషన్, నగర పరిసర 11 మండలాలకు సంబంధించి శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) రూపొందించిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై ప్రజల నుంచి సలహాలు, సూచనల కోసం శ్రీకాకుళం నగరంలో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ చల్ల ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎల్‌టీపీలు, నగర ప్రముఖులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు, మేధావులు, నగర అభివృద్ధిని కోరుకునేవారంతా సమావేశానికి హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

## 25న సూత్రా ఫౌండేషన్ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్ : బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 25న సాయంత్రం 6.30 గంటలకు సూత్రా ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు నిక్కు హరిసత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గాయకుడు కె.ఎల్.ఎన్.మూర్తి, నృత్య దర్శకురాలు డాక్టర్ తిమ్మరాజు నీరజా సుబ్రహ్మణ్యం, ఏ-1 గ్రేడ్ తబలా ఆర్టిస్టు బండారు రమణమూర్తిలను సత్కారం, మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ, సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా గాయత్రీ స్వరాంజలి ఆర్కెస్ట్రాచే రండి-మా పాట వినండి సినీ సంగీత విభావరి జరుగుతుందని పేర్కొన్నారు. అభిమానులంతా హాజరుకావాలని కోరారు.

## బీసీల రాజ్యాధికారం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: బీసీల రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్ర పోరాట రథయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతి రావు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కాయితి వెంకట రమణ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం రథయాత్ర పోస్టర్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ ఆవిష్కరించారు. రథయాత్ర ఇచ్ఛాపురంలో ప్రారంభమై తిరుపతి బహిరంగ సభతో ముగిస్తామన్నారు. 130 నియోజకవర్గాల మీదుగా యాత్ర సాగుతుందన్నారు. బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అన్ని పార్టీల్లో ఉన్న బీసీ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు, అన్ని కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘ సభ్యులు వాలిన ప్రసాద్, అమిరుల్ల భేగ్, ముద్దాడ రాజశేఖర్, ఇప్పిలి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# ఉమా సేవలు శ్లాఘనీయం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉన్నత విలువలు కలిగి చిత్తశుద్ధితో విధులు నిర్వహించిన కల్లేపల్లి ఉమామహేశ్వరరావు మరణం విచారకరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. నగరంలోని జిల్లా కోర్టు భవనంలో గురువారం ఉమామహేశ్వరరావుకు నివాళులు అర్పించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో 1వ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.శ్రీదేవి, మూడో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బార్ అసోషియేషన్ కార్యాలయంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. బార్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాది తర్లాడ రాధాకృష్ణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, కూన అన్నంనాయుడు, బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు

# భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



కోదండ రామాలయం వద్ద క్యూ లైన్లలో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో అర్చకులు శేషాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఈవో గుర్నాథరావు పర్యవేక్షించారు. నారాయణ తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు బురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో తులసి దళార్చన పూజలు చేశారు. ఈవో శ్యామలరావు పర్యవేక్షించారు.

**కార్తీక దీపోత్సవం..**

ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలస గ్రామంలో గ్రామ దేవత అసిరితల్లి ఆలయంలో గురువారం సాయంత్రం కార్తీక దీపోత్సం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపాలను వెలిగించారు. ఆలయ ఆవరణలో కూచిపూడి నృత్య కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జి.సిగడాం: కార్తీకమాసం ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని రంగనాథ స్వామి, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బొంతావారివీధిలో కృష్ణార్జున మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలసలోని అసిరితల్లి ఆలయ ఆవరణలో దీపారాధన చేస్తున్న భక్తులు



ఎచ్చెర్ల క్యాంపస్: అసరి తల్లి ఆలయ ఆవరణలో కూచిపూడి నృత్య ప్రదర్శన



జి.సిగడాం: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



దూదివారి కోవెలలో తులసిమాల అలంకరణలో వెంకన్న



కలెక్టర్ బంగ్లా సమీపంలో కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో శంఖు, చక్ర, నామాల దీపారాధన

# ఘనంగా అయ్యప్ప పడిపూజ



శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని పీఎన్ కాలనీలో గురువారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి బ్రహ్మశ్రీ దేవరకొండ శంకర్‌నారాయణశర్మ ఆధ్వర్యంలో భోగవల్లి సూర్యనారాయణస్వామి శబరిమల యాత్ర సందర్భంగా ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పస్వాములు, భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరయ్యారు.